TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక : 28 | మంగళవారం, మే 7, 2024 | కాంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

## ఎన్నికల వేళ.. మద్యం అమ్మకాల జోరు !

హైదరాబాద్, అమరావతి:ఎన్నికల వేళ మద్యం అమ్మకాలు పెరిగాయి. ఫలనా పార్టీ అన్న తేడా లేకుండా అన్ని పార్టీలు మద్యం డంపులను ఏర్పాటు చేసుకుంటున్నాయి. కార్యకర్తలు కూడా మందులేనిదే అడుగు బయటపెట్టడం లేదు. దీనికితోడు ఎండాకాలం కావడంతో బీర్లకు యమ గిరాకీ పెరిగింది. ఎన్నికల సమయం కావడంతో తెలుగు రాష్ట్రాల్లో విచ్చలవిడి మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ఇకపోతే మద్యంపై అదుపు లేకుండా పోతోంది. ఇటీవల వరుసగా గంజాయి, మాదక ద్రవ్యాల పట్టివేత సంచలనంగా మారింది. పోలీసులు కఠిన చర్యలు తీసుకుని తనిఖీలు ముమ్మరం చేయడంతో డ్రగ్స్‌తో పాటు, గంజాయి పట్టుబడుతోంది. ఇకపోతే సులువుగా డబ్బు సంపాదించాలనుకున్న వారు ఈ వ్యాపారంలోకి దిగుతున్నారు.



2వ పేజీలో...



## రఫాపై ఇజ్రాయెల్ దాడి...

### 16 మంది పాలస్తీనియన్లు మృతి

రఫా: ఇజ్రాయెల్–హమాస్ మధ్య కాల్పుల విరమణకు సంబంధించి చర్చలు విఫమయ్యా యి. దీంతో హమాస్‌కు ప్రధాన స్థావరంగా ఉన్న గాజాలోని రఫాపై ఇజ్రాయెల్ దాడులు ముమ్మరం చేసింది. హమాస్ దాడులకుప్రతిగా ఇజ్రాయెల్ బలగాలు విరుచుకుపడటంతో 16 మంది మరణించారు. రఫాపై వేర్వేరు చోట్ల నుంచి నగరంపై రెండు పర్యాయాలు దాడి జరిగిందని వైద్య వర్గాలు వెల్లడించాయి.

2వ పేజీలో...





## ఒడిషాలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు

### అధికారంలోకి రాగానే హామీలు నెరవేరుస్తా ఒడిషా ప్రచారంలో ప్రధాని మోడీ

భువనేశ్వర్, : ఒడిశాలో రెండు యాగాలు జరుగుతున్నాయని.. ఒకటి దేశంలో మరోసారి ఎన్డీఏ సర్కార్ ఏర్పాటు చేయడానికి, మరోటి రాష్ట్రంలో బీజేపీ నేతృత్వంలోని డబల్ ఇంజిన్ సర్కార్ కోసమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. మోదీ సోమవారం బర్హంపూర్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఒడిశాలో బీజేపీ డబల్ ఇంజిన్ ప్రభుత్వం వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 'రాష్ట్రంలో డబల్ ఇంజిన్ సర్కార్ రాబోతోందని మీ ఉత్సాహం తెలియజేస్తోంది. బీజేపీ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవానికి ఆహ్వానం అందించడానికి నేను ఒడిశా వచ్చాను. అధికారంలోకి రాగానే మేం ఇచ్చిన హామీలన్నీ పూర్తిగా నెరవేరుస్తాం. ఇది మోదీ హామీ. ఇక్కడ అధికారంలో ఉన్న బిజు జనతా దళ్ ప్రభుత్వ గడువు జూన్ 4తో ముగుస్తుంది. జూన్ 10న భువనేశ్వర్‌లో బీజేపీ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుంది. ఇవాళే మీ అందరినీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నా' అని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా మోదీ అధికార బీజేడీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలపై మండిపడ్డారు.

2వ పేజీలో...




## తెలుగు రాష్ట్రాల్లో నిప్పులవాన

2వ పేజీలో...

### ప్రతాపం చూపిస్తున్న భానుడు అక్కడక్కడా వర్షాలతో కొంత చల్లని వాతావరణం తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు పడే ఛాన్స్

హైదరాబాద్, : ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భానుడు నిప్పులు కురిపిస్తోన్న వేళ హైదరాబాద్ వాతావరణ శాఖ ప్రజలకు కూల్ న్యూస్ అందించింది. రాగల 5 రోజుల్లో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించిన అధికారులు.. ఈ మేరకు ఆయా జిల్లాకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. అలాగే, కొన్ని జిల్లాల్లో వడగాలులు కూడా కొనసాగే అవకాశాలున్నాయని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అటు, ఆదివారం ములుగు జిల్లా భారీ వర్షంతో ప్రజలు ఎండ వేడిమి నుంచి కాస్త ఉపశమనం పొందారు. ఏటూరునాగారం మండల కేంద్రంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది.





2వ పేజీలో...

## లిక్కర్ కేసులో కవితకు.. దక్కని ఊరట

### బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరణ పలుమార్లు బెయిల్ దరఖాస్తుల తిరస్కరణ




## నేడు మూడోదశ పోలింగ్

### అహ్మదాబాద్‌లో ఓటేయనున్న ప్రధాని మోడీ

అహ్మదాబాద్, :ప్రధాని నరేంద్ర మోదీ తన ఓటు హక్కును మంగళవారం వినియోగించు కోనున్నారు. అహ్మదాబాద్‌లోని నిషాన్ ఉన్నత పాఠశాలలో ఆయన తన ఓటు వేయనున్నారు. దేశవ్యాప్తంగా మూడో దశ పోలింగ్ మంగలవారం జరగనుంది. అందులో భాగంగా గుజరాత్‌లోని 25 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. మరోవైపు అహ్మదాబాద్ నగరంలోని ఆరు పాఠశాలలకు ఈ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో పాఠశాలలకు శెలవులు ప్రక టించి.. డాగ్ స్క్వాడ్‌తో అణువణువు గాలింపు చర్యలు చేపట్టారు. ఆ క్రమ ంలో ఇవి నకిలీవని తెలిసింది. అయి నా రేపు ప్రధాని నరేంద్ర మోదీ అహ్మదాబాద్ నగరా నికి వస్తుండడంతో.. భద్రతను కట్టుది ట్టం చేశారు. ఇంకోవైపు గాంధీనగర్ నుంచి కేంద్రహోం శాఖ మంత్రి అమిత్ షా బరిలో దిగారు. ఆయన సైతం రేపు.. తన ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. ఈ మూడో దశలో మొత్తం 12 రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మొత్తం 95 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈ దశలో మొత్తం 1,351 మంది అభ్య ర్థులు బరిలో దిగారు. నరేంద్ర మోదీ.. వారణాసి లోక్‌సభ స్థానం నుంచి ము చ్చటగా మూడోసారి ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగుతున్నారు. ఆ క్రమంలో మే 13న వారణాసిలో ప్రధాని.. తన నామినేషన్ వేయనున్నారు.

2వ పేజీలో...





## భువనగిరిలో క్రాస్ ఓటింగ్ టెన్షన్..

నల్గొండ, : తెలంగాణలో పార్లమెంటు ఎన్నికలు రక్తి కడుతున్నాయి. ఇటీవల ఓ బహిరంగ సభలో టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్ రెడ్డి ఓ ఆరోపణ చేశారు. రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లలో కనీసం నాలుగు చోట్ల బీఆర్ఎస్, బీజేపీతో కుమ్మక్కయ్యింది. ఆ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు బీఆర్ఎస్ తెరవెనుక సహకారం అందిస్తోంది. దీనికోసం తమ పార్టీ నుంచి డమ్మీ అభ్యర్థులను బరిలోకి దింపింది అన్నది ఆ సంచలన ఆరోపణ. కానీ, బీఆర్ఎస్ వైపు నుంచి ఈ ఆరోపణలను తిప్పికొట్టే ప్రయత్నం పెద్దగా ఏదీ జరగలేదు. సీఎం రేవంత్ రెడ్డి ఇలా చేసిన ఆరోపణల్లోని నాలుగు లోక్ సభా నియోజకవర్గాల్లో ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని భువనగిరి పార్లమెంటు స్థానం ఒకటి. భువనగిరి ఎంపీ సీటు విషయంలో బీఆర్ఎస్ చేతులు ఎత్తేసిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

4వ పేజీలో...



## రాజకీయాల్లో వారసత్వం ఒక్కరిదే



## జార్ఖండ్‌లో కట్టలుకట్టలుగా నోట్లు

### మంత్రి అనుచరుడి ఇంట్లో 25కోట్లు పట్టివేత

రాంచి, : ఝూర్ఖండ్‌లో ఓ మంత్రి సహాయకుడి ఇంట్లో కుప్పలు కుప్పలుగా నోట్ల కట్టలు కనిపించాయి. రాజధాని రాంచీలో పలు చోట్ల ఈడీ సోదాలు నిర్వహించి ఈ నగదుని జప్తు చేసింది. మనీలాండరింగ్ కేసులో ఈ సోదాలు చేపట్టారు ఈడీ అధికారులు. మొత్తంగా రూ.25 కోట్ల నగదుని స్వాధీనం చేసుకున్నారు.

3వ పేజీలో...



3వ పేజీలో...

## కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం

### మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కారు ఎన్నికల ప్రచారంలో మండిపడ్డ కెటిఆర్

సిరిసిల్ల, : కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపెట్టి.. మోచేతికి బెల్లం పెట్టీ మోసపూరిత హామీలతో గెలిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలో ఒక్కటి అమలు చేసి మొగుళ్లకు మహిళకు తాకులాట పెట్టిందని విమర్శించారు. ఆరు గ్యారంటీలు అమలు అయ్యాయా? చెప్పాలరన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శాంతి నగర్, గాంధీచౌక్, తెలంగాణ చౌక్‌లో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించి.. కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు.

# భువనగిరలో క్రాస్ ఓటింగ్ టెన్షన్...



అభ్యర్థి ఎంపిక నుంచి మొదలు.. ప్రస్తుతం జరుగుతున్న ప్రచారం దాకా బీఆర్ఎస్ లో పెద్దగా ఉత్సాహం కనిపించడం లేదు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నియోజకవర్గంలో ఇప్పటికే రోడ్ షో కూడా జరిపి ప్రచారం చేసినా, కేడర్ లో జోష్ నింపడంలో కేసీఆర్ పర్యటన పెద్దగా ఉపయోగపడలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సీటు నుంచి టికెట్ ఆశించిన తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలక్రిష్ణారెడ్డికి టికెట్ ఇచ్చి ఉంటే, 2014 విజయం సాధించిన సీటును తిరిగి దక్కించుకునేందుకు అవకాశం ఉండేదని, కనీసం గట్టి పోటీ ఇవ్వగలిగేదన్న విశ్లేషణలు ఉన్నాయి. కానీ, ఎంపీ సీటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఇబ్రహీంపట్నం మినహా మిగిలిన ఆరు సెగ్మెంట్లకు ఏమాత్రం పరిచయం లేదని క్యామ మల్లేష్ యాదవ్ కు టికెట్ ఇవ్వడంతో ముందే ఓటమిని అంగీకరించిందా అన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారంలో, ఓటర్లను కలుసుకోవడంలో, పర్యటనల్లో వెనకబడి ఉన్నారు. ఆయనకు సహకరిస్తున్న నియోజకవర్గ నాయకత్వం కూడా పెద్దగా లేదు. దీంతో ఎక్కడా బీఆర్ఎస్ ప్రచార హవా కనిపించడం లేదు.ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఒక జనగామలోనే పార్టీ ఎమ్మెల్యేగా ఉండగా, ఆలేరు, భువనగిరి, ఇబ్రహీంపట్నం, మునుగోడు, నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ ఆరు చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల మెజారిటీనే ఏకంగా 2.73 లక్షలు కావడం గమనార్హం. 18 లక్షల దాకా ఓట్లున్న భువనగిరి ఎంపీ సీటును దక్కించుకోవాలంటే పోలైన ఓట్లలో కనీసం 6 లక్షల మార్కు చేరుకోవాలన్న అంచనాలు ఉన్నాయి. భువనగిరి ఎంపీ సీటును

మొదటిపేజీ తరువాయి...

దక్కించుకున్న బీఆర్ఎస్ కు 4.48 లక్షలు ఓట్లు వచ్చాయి. 2019 ఎన్నికల్లో ఓటమి పాలైన ఆ పార్టీకి 5.27 లక్షలు వచ్చాయి. ఈ సారి కనీసం 6లక్షల పైచిలుకు ఓట్లు వస్తే గెలిచే అవకాశాలు తక్కువ. ఇప్పటికే పోటీ బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ మధ్య జరుగుతుందని బాగా ప్రచారం అయిన నేపథ్యంలో బీఆర్ఎస్ ఒక విధంగా ఆత్మరక్షణలో ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడం, ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీ ఎమ్మెల్యేలు ఉండడం వంటి కాంగ్రెస్ కు పాజిటివ్ అంశాలు. కేంద్రంలో తిరిగి బీజేపీ అధికారంలోకి వస్తుందని, మోడీ మూడో సారి ప్రధాని అవుతారని మోడీ చరిష్మాపై ఆధారపడుతున్న బీజేపీ అంచనాల్లేకుండా బరిలోకి దిగినా ప్రచారంలో ఊపుమీదుంది. బీజేపీ అభ్యర్థి 2014లో ఎంపీగా గెలిచి ఉండడం, 2019 లో స్వల్ప ఓట్ల తేడాతోనే ఓడిపోయి ఉండడం, ఎంపీ నియోజకవర్గంలో పరిచయాలు బాగా కలిగి ఉండడం బీజేపీకి పాజిటివ్ అంశాలుగా ఉన్నాయి. కానీ, బీఆర్ఎస్ కు అనుకూలమైన వాతావరణమే లేదన్న అభిప్రాయం బలంగా ఉంది. ఈ ఎన్నికల్లో భువనగిరిలో వెనుకబడిపోయినట్లు కనిపిస్తున్న బీఆర్ఎస్ ఓట్లు బీజేపీ అభ్యర్థికి క్రాస్ అవుతాయన్న ప్రచారం రెండు మూడు రోజులుగా ఊపందుకుంది.

బీజేపీ అభ్యర్థి గతంలో బీఆర్ఎస్ కు చెందిన వాడు కావడం, ఇదే నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి ఎంపీగా గెలిచి ఉండడం, ఆయన సామాజిక వర్గం గౌడ్లకు అత్యధిక ఓట్లు ఉండడం, బీఆర్ఎస్ అభ్యర్థికి నియోజకవర్గంలో పెద్దగా ఎక్స్ పోజర్ లేకపోవడం, కాంగ్రెస్ ను నిలవరించడానికి బీఆర్ఎస్ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే ఈ ప్రచారం జరుగుతోంది. బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ కు ఉన్న బీఆర్ఎస్ లో ఉన్న వ్యక్తిగత పరిచయాలతో ఆయన అన్ని పార్టీల్లోని తమ సామాజిక వర్గానికి చెందిన వారిని, మాజీ పార్టీలోని సంబంధాలను ఇప్పటికీ కొనసాగిస్తుండడంతో ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ లోని ఒక వర్గం పార్టీతో నిమిత్తం లేకుండా బూర నర్సయ్య గౌడ్ సహకరిస్తుందన్న ప్రచారం నేపథ్యంలో ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి క్రాస్ అవుతాయన్న అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది.

# రాజకీయాల్లో వారసత్వం ఒక్కరిదే

మొదటిపేజీ తరువాయి...

అమరావతి, : వైఎస్ రాజకీయ వారసుడిగా తనకు మాత్రమే గుర్తింపు ఉందని ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఒక తరంలో ఒకే కుటుంబం నుంచి ఒకరికి మించి రాజకీయాల్లోకి వస్తే.. అది అనివార్యంగా కుటుంబంలో చీలికకు దారితీస్తుందని తన సోదరి షర్మిలను ఉద్దేశించి అన్నారు. ఆయన ఓ జాతీయ చానెల్ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఏపీ రాజకీయాల్లో జగన్ ఓ వైపు- మిగతా వాళ్లంతా మరోవైపు అన్నట్లుగా ఎన్నికలు జరుగుతున్న విషయం చూస్తూనే ఉన్నాం. తాను సింగిల్ అంటూ ఆయన కూడా చెప్పుకుంటున్నారు. టీడీపీ-బీజేపీ-జనసేనతో కూడిన మిత్రపక్షాలు ఓ వైపు- జగన్ ఓ వైపు ఎన్నికల్లో హోరాహోరీ తలపడుతున్నారు. అయితే ఈ ఎన్నికల్లో ఇంకో ముఖ్య విషయం కూడా ఉంది. జగన్ సోదరి షర్మిల కాంగ్రెస్ పగ్గాలు చేపట్టి తన అన్నకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. మొదట తెలంగాణలో సొంత పార్టీ స్థాపించి ఎన్నికల ముందు వరకూ పోరాడిన షర్మిల అనూహ్యంగా ఆంధ్రలో అడుగుపెట్టారు. తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి ఈ పార్టీ పగ్గాలు చేపట్టారు. జగనన్న వదిలిన బాణం అని చెప్పుకున్న ఆమె.. ఆయన వైపే దూసుకు వెళుతున్నారు. జగన్ పాలనతో పాటు.. తమ కుటుంబంలో జరిగిన చిన్నాన్న హత్య కేసు విషయంలో జగన్ ను టా÷-గ్గ÷ట్ చేశారు. అయితే దీనిపై పెద్దగా స్పందించని జగన్ ... ఓ చానెల్ ఇంటర్వ్యూలో మాత్రం వివరంగానే స్పందించారు. షర్మిల కాంగ్రెస్ పార్టీ ద్వారా తనను టార్గెట్ చేయడంలో చంద్రబాబు రేవంత్ పాత్ర ఉందని జగన్ ఆరోపించారు. తెదేపా అధినేత చంద్రబాబు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ ద్వారా షర్మిలను తనకు వ్యతిరేకంగా మలిచారని చెప్పారు. తన సోదరిలిద్దరూ చంద్రబాబు చెప్పినట్లు నడుచుకుంటున్నారని ఆరోపించారు. తమ కుటుంబాన్ని ఇబ్బంది పెట్టిన, తన అన్నను జైలులో పెట్టిన కాంగ్రెస్ పార్టీతో చేతులు కలపడం కన్నా దారుణం ఏముంటుందన్నారు. అదే ఇంటర్వ్యూలో జగన్ మరికొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక రాజకీయ కుటుంబంలో ఒక తరానికి ఒకరే నాయకత్వం వహిస్తారని .. ప్రస్తుతం వైఎస్ వారసుడిగా తాను ఉన్నందున షర్మిల రాజకీయాల్లోకి రాకుండా వ్యాపారాలు చూసుకుంటే



బాగుండేదన్నారు. ఒకరు పార్టీకి నాయకత్వం వహిస్తున్నప్పుడు మరొకరు ఒకే కుటుంబం నుంచి వస్తే.. అది రాజకీయ పార్టీగా ఉండదని.. కుటుంబ ట్రస్ట్‌గా మారిపోతుందన్నారు. కుటుంబంలో మరొకరు పోటీగా వచ్చినప్పుడు అది కుటుంబ బంధాలను నాశనం చేస్తుందని.. మా విషయంలో ఇది రుజువైందన్నారు. ఈ విషయాన్ని షర్మిల కు చెప్పడానికి ఎప్పుడైనా ట్రై చేశారా అని ప్రశ్నించగా..

'ఆవిడ చంద్రబాబు మాట వింటుంటే తాను ఎలా చెప్పగలను' అన్నారు. ప్రతీ విషయం చంద్రబాబుతో సంబంధం ఉందని ఎలా చెప్పగలరు అంటే.. 'తాను నా చెల్లెలు.. నాకు తెలుసు కదా..' అని బదులిచ్చారు. అయితే షర్మిల ప్రచారం, కాంగ్రెస్ పార్టీ వల్ల తనకు ఎలాంటి నష్టం ఉండదని జగన్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి నోటా కంటే ఒక్క ఓటు కూడా ఎక్కువ రాదని ..ఈ విషయాన్ని నోట్ చేసుకోవాలంటూ సూటిగా చెప్పారు. వైఎస్ వివేకా హత్య కేసు విషయంలోనూ.. చంద్రబాబు మాటలు నమ్మి చెల్లెల్లు రాజకీయం చేస్తున్నారని.. 2019 ఎన్నికల్లో వీళ్లు అవినాష్ తరపున ప్రచారం చేశారని.. 2024 వచ్చే సరికే ఏమైందని ప్రశ్నించారు. ఎన్నికల్లో బీజేపీ టీడీపీతో కలిసి వెళ్లడంపై జగన్ ఎలాంటి ప్రతికూల వ్యాఖ్యలు చేయలేదు. ఓ రాజకీయ పార్టీగా అది వాళ్లిష్టం అని.. తమను మాత్రం పొత్తులోకి రావాలని బీజేపీ కోరలేదన్నారు. వ్యక్తిగతంగా తాను రాహుల్ గాంధీ కన్నా.. మోదీ వైపే మొగ్గు చూపుతానని.. రాహుల్ తన పట్ల వ్యవహరించిన తీరుకు తాను ఆయన కన్నా ఏ నాయకుడినైనా ఉన్నతంగానే భావిస్తా అన్నారు.

# ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిప్పులవాన

కొన్నిచోట్ల గాలి వేగానికి ఇళ్ల పైకప్పులు ధ్వంసమయ్యాయి. ఆకస్మిక వర్షాలతో పలుచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. ఆదివారం కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. సోమవారం భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్, హనుమకొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అయితే, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని హెచ్చరించింది. మంగళవారం సిద్దిపేట, రంగారెడ్డి, భువనగిరి, వికారాబాద్, మహబూబ్ నగర్ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కొత్తగూడెం, ఖమ్మం, సిద్దిపేట, భువనగిరి, హైదరాబాద్ , రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొన్నారు. బుధ, గురువారాల్లోనూ పలు చోట్ల భారీ, మరికొన్ని

మొదటిపేజీ తరువాయి...

ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించారు. మరోవైపు, ఏపీలోనూ అధిక ఉష్ణోగ్రతలతో జనం అల్లాడుతున్న క్రమంలో అమరావతి వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. ద్రోణి ప్రభావంతో ఈ నెల 7న రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి, చిత్తూరు, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవొచ్చని తెలిపారు. మిగిలిన చోట్ల తేలికపాటి వర్షం కురిసే ఛాన్స్ ఉందని వెల్లడించారు. ఆది, సోమవారాల్లో కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలతో పాటు గంటకు 40 - 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పారు. అటు, ఇప్పటికే ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల, తిరుపతి సహా కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో వర్షాలు కురుస్తున్నాయి.

## ఒడిషాలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు

మొదటిపేజీ తరువాయి...

సీఎం నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీ సర్కార్ ధనిక రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని.. పేదల సంఖ్య రాష్ట్రంలో విపరీతంగా పెరిగిందని..అందుకు బీజేడీ,కాంగ్రెస్ పార్టీలుబాధ్యులని అన్నారు. రాష్ట్రంలో 50 ఏళ్లు కాంగ్రెస్, 25 ఏళ్లు బీజేడీ పాలించాయని.. పేదల సంఖ్య పెరగడంపై ఆయా పార్టీలు ఏం సమాధానం చెబుతాయని ప్రశ్నించారు. లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పి బీజేపీని గెలిపించాలని మోదీ కోరారు. ఒడిశాలో మే 13న ఒకేసారి అసెంబ్లీతో పాటు సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగుతుంది.

## రఫాపై ఇజ్రాయెల్ దాడి..

మొదటిపేజీ తరువాయి...



ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపాయి. పెద్ద సంఖ్యలో భవనాలు నేలమట్టమయ్యాయని పేర్కొన్నాయి. ఇక గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటివరకు 34,683 మంది పాలస్తీనా ప్రజలు మరణించారు. కాగా, ఇజ్రాయెల్‌తో ఈజిప్టులోని కైరోలో తాజాగా జరిగిన కీలక చర్చలు ముగిశాయని హమాస్ ప్రకటించింది. చర్చల అనంతరం హమాస్ ప్రతినిధులు ఖతార్ వెళ్లిపోయారని పేర్కొంది. గాజా నుంచి ఇజ్రాయెల్ బలగాల ఉపసంహరణ, యుద్ధం ముగింపు లాంటి హమాస్ కీలక డిమాండ్లను నెతన్యాహు సర్కారు తిరస్కరించినట్టు సమాచారం.

## కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం

మొదటిపేజీ తరువాయి...



నేత కార్మికుల కోసం రూ.3వేలకోట్లు ఖర్చు చేసి కార్మికులను కాపాడుకున్నామన్నారు. ఐదేళ్లలో రూపాయి మందు పంచలేదని.. మీరు నాకు ఇచ్చిన దయ అన్నారు. రాజకీయంగా జన్మనిచ్చింది సిరిసిల్లనేనన్నారు. సిరిసిల్ల పట్టణం అతి సుందరంగా తీర్చిదిద్దామన్నారు. అబద్దాలు చెపితే డిజిటల్ ప్రపంచలో ఒక్క నిమిషాల్లో దొరికిపోయారన్నారు. అన్నమో రామచంద్ర అనే పరిస్థితి వచ్చిందని.. తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌ని పట్టుకొని పట్టుకొని కాంగ్రెస్ నేతలు అనేక మాటలు, బూతులు మాట్లాడుతుందంటూ మండిపడ్డారు. వందరోజుల్లో రైతు రుణమాఫీ, పింఛన్లు వచ్చాయా? అంటూ ప్రశ్నించారు. ఓట్లు చేసుకునేటప్పుడు ఒక లెక్క.. ఓట్లు వేయించుకున్నాకా ఒక లెక్క ఉంది కాంగ్రెస్ పార్టీ తీరు అంటూ విమర్శించారు. కేసీఆర్ మళ్లీ కావాలంటే మే 13 13న కారు గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు. అప్పుడే తెలంగాణలో శాసించే అధికారం వస్తుందన్నారు. ÷ాముడు అందరివాడని.. మతం పేరుతో ఓట్ల రాజకీయం చేస్తున్నారన్నారు. వేములవాడ రాజన్న, కొండగట్టు దేవాలయాలు బీజేపీకి పుట్టకముందు నుండే ఉన్నాయన్నారు. సిరిసిల్లలో అనేక అభివృద్ధి పనులు చేసినా, బీజేపీ ఒక్క పనికి చేసిందా..? ఒక్క శిలాఫలకం వేయని వారికి ఎందుకు ఓటు వేయాలన్నారు. మోదీ ముడిచమురు ధరలు తగ్గినా పెట్రోల్, డీజిల్ రేట్లపై పన్నులు వేసి వసూలు చేశారని విమర్శించారు. మనకు ప్రధానమంత్రి కాదని.. పిరమైన ప్రధానమంత్రి అంటూ విమర్శించారు.

# లిక్కర్ కేసులో కవితకు దక్కని ఊరట

మొదటిపేజీ తరువాయి...

న్యూఢిల్లీ, : ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరోమారు నిరాశే ఎదరుయ్యింది. బెయిల్ ఇచ్చేందుకు కోర్టు తిరస్కరించింది. ఇప్పట్లో బెయిల్ వచ్చే అవకాశాలు అస్సలు కనిపించట్లేదు. తనకు బెయిల్ మంజూరు చేయాలని సీబీఐ ప్రత్యేక కోర్టు రౌస్ అవెన్యూ కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా.. కోర్టు తిరస్కరించింది. ఈడీ, సీబీఐ కేసుల్లో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ రెండింటినీ కోర్టు కొట్టేసింది. దీంతో కవితకు మరో బిగ్ షాక్ తగిలినట్టు అయ్యింది. కాగా.. తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల ప్రచారం చేయడానికి అధిష్టానం కవితను స్టార్ క్యాంపెయినర్‌గా నియమించిన సంగతి తెలిసిందే. ఇదే విషయాన్ని కోర్టుకు తెలియజేస్తూ.. ఎన్నికల ప్రచారంలో పాల్గొనాల్సి ఉందని చెప్పినప్పటికీ రౌస్ అవెన్యూ కోర్టు తిరస్కరించింది. మరోవైపు.. మహిళగా పీఎంఎల్ఏ సెక్షన్-45 ప్రకారం బెయిల్ అర్హత ఉందన్న విషయాన్ని పిటిషన్‌లో కవిత పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ఇదివరకే న్యాయస్థానం విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో ఇవాళ కవిత బెయిల్‌పై రౌస్ ఎవిన్యూ స్పెషల్ కోర్టు జడ్జి కావేరి బవేజా.. తిరస్కరిస్తూ తీర్పును వెలువరించారు. కాగా.. లిక్కర్ కేసులో మార్చి 15న కవితను ఈడి అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అలాగే తీహార్ జైల్లో ఉన్న ఆమెను ఏప్రిల్ 11న సీబీఐ అరెస్ట్ చేసింది. గత నెల 22న రౌస్ అవెన్యూ కోర్టులో వాదనలు జరుగ్గా న్యాయమూర్తి కావేరీ బవేజా తొలుత మే-02కు తీర్పు రిజర్వు చేశారు. అయితే మే2న తీర్పు వస్తుందని అంతా భావించగా.. ఈడీ కేసులో బెయిల్ పిటిషన్‌పై తీర్పు మే6కు రిజర్వ్ అయ్యింది. ఈ నేపథ్యంలో రెండు కేసుల్లో బెయిల్ పిటిషన్లపై తీర్పును మే 6న వెలువరిస్తామని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఒకవేళ కవితకు బెయిల్ లభిస్తే జ్యుడీషియల్ రిమాండ్ నుంచి మినహాయింపు లభిస్తుందని అందరూ భావించారు కానీ.. అదేమీ జరగలేదు. ఇప్పటికే పలుమార్లు బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా కోర్టు తిరస్కరిస్తూనే ఉన్నది. ఆ మధ్య తన కుమారుడికి పరీక్షలు ఉన్నాయని బెయిల్ మంజూరు చేయాలని కోరినప్పటికీ కోర్టు తిరస్కరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని కోరగా కోర్టు తిరస్కరించింది.

# ఎన్నికల వేళ..మద్యం అమ్మకాల జోరు !

విస్తుగొలిపే విషయం ఏమంటే చదువుకున్న ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా ఇందులో పడిపోతున్నారు. తేలికగా డబ్బు సంపాదన కోసం ఈ వ్యాపారాన్ని ఎంచుకుంటున్నారు. మరోవైపు మద్యం, గంజాయి వంటివి అందుబాటులో ఉండడంతో జులాయిలు అకృత్యాలకు తెగబడుతున్నారు. ఎపిలో మద్యం ధరలు పెంచినా అమ్మకాలు ఆగడం లేదు. మద్యం ప్రధాన ఆదాయవనరు కావడంతో తెలుగు రాష్ట్రాల్లో అమ్మకాలపై అజమాయిషీ లేకుండా పోతోంది. బ్రాండ్ ఏదైనా డబ్బులు తెచ్చిపెడుతోంది. ఇటీవల గంజాయి కూడా విపరీతంగా పట్టుబడుతోంది. ఎంతగా స్వాధీనం చేసుకున్నా రవాణా ఆగడం లేదు. దీనికి కారణం మార్కెట్లో డిమాండ్ కారణంగా గంజాయి పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎపితో పోలిస్తే తెలంగాణలో మద్యం అమ్మకాలు పెరిగాయి. మద్యం అమ్మకాలతో పాటు నేరాలు, ఘోరాలు కూడా పెరుగుతున్నాయి. మద్యం మత్తులోనే నేరాలు జరుగుతున్నట్లు పోలీసులు కూడా అంగీకరిస్తున్నారు. అత్యాచారలు, దొంగతనాలు, కిడ్నాప్‌లు ఇలా అనేక రకాలైన నేరాలకు మద్యం కారణం అవుతోంది. సంపూర్ణ మద్యనిషేధం విధిస్తామని అధికారంలోకి వచ్చిన ఎపి సిఎం జగన్ ఇప్పుడా ఊసే ఎత్తడం లేదు. ఎన్నికల్లో కనీసం మాటమాత్రంగా అయినా మాట్లాడడం లేదు. మద్యం అమ్మకాలు లేకపోతే ప్రభుత్వం నడిచే పరిస్థితిలో లేదు. దీంతో మద్యం అమ్మకాలను బాహాటంగానే ప్రోత్సహిస్తున్నారు. ఇష్టం వచ్చిన బ్రాండ్లతో అమ్మకాలు చేసి ఖజానా నింపుకుంటున్నారు. ఈ క్రమంలో అక్కడా..ఇక్కడా అన్న తేడా లేకుండా నేరాలు పెరుగుతున్నాయి. అంతెందుకు ఎన్నికల ప్రచార వేళ అమ్మకాలు పెరిగాయి. పార్టీ కార్యకర్తలకు మందు లేనిదే కాలు బయట పెట్టడం లేదు. ఏ పార్టీ అయినా మద్యం, ముక్క ఉండాల్సిందేనని తేల్చి చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నకల తేదీలు దగ్గర పడుతున్న వేళ..అన్ని పార్టీల కార్యకర్తలు ఆత్మీయ సమ్మేళనాల్లో మద్యంతోపాటు ముక్క లేనిదే కదలడం లేదు. అత్యాచార ఘటనల్లో అనేకం కేవలం మద్యం కారణంగానే జరిగినట్లుగా గుర్తించారు. రేపిస్టులకు కఠిన శిక్షలు పడితే ఇలాంటి దారుణాలు చోటుచేసుకోవు. ప్రభుత్వం తాము కఠినంగా ఉన్నామని అనుకుంటే సరిపోదు. కఠినంగా ఉంటున్నారన్న సందేశం ప్రజల్లోకి వెళ్లగలిగేలా చేయాలి. అప్పుడే ఇలాంటి ఘటనలు జరగవు. అలా చేయాలనుకున్న వారు కూడా జంకుతారు.అక్రమాలు, అకృత్యాలపై ప్రభుత్వాలు ఉదాసీనంగా ఉండడం వల్లనే దారుణాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. అవి ఒక్క ఎపిలోనే జరుగుతున్నాయని చెప్పడానికి లేదు. తెలంగాణతో పాటు ఘనత వహించిన యుూపిలో కూడా జరుగుతూనే ఉన్నాయి. గొప్పలుచెప్పుకుంటున్న కమ్యూనిస్టుల ఏలుబడిలో ఉన్న కేరళలోనూ జరుగుతున్నాయి. రాక్షసులకు ప్రాంతం ఏదన్నది ముఖ్యం కాదు. రాక్షస ప్రవృత్తి ఉన్నవారు ప్రపంచమంతా నిండి ఉన్నారు. అలాంటి వారికి మద్యం తోడవుతోంది.

## జార్ఖండ్‌లో కట్టలుకట్టలుగా నోట్లు

మొదటిపేజీ తరువాయి...

ఝార్ఖండ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఆలమ్‌గిర్ ఆలమ్ సహాయ కుల ఇళ్లలో పెద్ద ఎత్తున నగదు దాచి పెట్టారన్న అనుమానంతో రెయిడ్స్ చేసింది ఈడీ. గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన మాజీ చీఫ్ ఇంజనీర్ వీరేంద్ర రామ్‌కి ఈ మనీలాండరింగ్ కేసుతో సంబంధం ఉన్నట్టు గుర్తించారు. ఇప్పటికే వీరేంద్ర రామ్‌ని 2023 ఫిబ్రవరిలో ఈడీ అధికారులు మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ చేశారు. ఈ సోదాల్లో దొరికిన నగదు వీడియోలు సోషల్ మీడియా లో వైరల్ అవుతున్నాయి. మంత్రి వ్యక్తిగత సహాయకుడు సంజీవ్ లాల్ ఇంట్లో ఈ నోట్ల కట్టలు దొరికాయి. కాంగ్రెస్ నేత అయిన ఆలమ్‌గిర ఆలమ్ పకూర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు.యితే...ఈ సోదాలపై బీజేపీ విమర్శలు మొదలు పెట్టింది. ఝార్ఖండ్‌లో అవినీతి ఇంకా అంతమైపోలేదని, ఎన్నికల సమయంలో ఈ స్థాయిలో నగదు దొరకడమేంటని ప్రశ్నిస్తోంది. రాంచీలో ఒకేసారి 9 చోట్ల ఈ సోదాలు చేశారు ఈడీ అధికారులు. ఈ మనీలాండరింగ్ కేసుతో సంబంధం ఉన్న ఇంజనీర్ ఇళ్లలో రెయిడ్స్ నిర్వహిస్తున్నారు. 'ఝార్ఖండ్‌లో అవినీతి ఇంకా కొనసాగుతూనే ఉంది. ఎన్నికల కోసం భారీగా ఖర్చు చేసేందుకే ఈ డబ్బులన్నీ ఇలా దాచి పెట్టుంటారు. ఎన్నికల సంఘం కచ్చితంగా వీళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి'

## సంపాదకీయం

మంగళవారం, మే 7, 2024

# సామాన్య జనం గెలిచేదెప్పుడు...?

ప్రజలు తమను తాము రాజకీయ చైతన్యం ఉన్న వారిగా అభివర్ణించుకుంటారు. ఈసారి ఎన్నికల్లో తమ తడాఖా ఏమిటో చూపిస్తామని బీరాలు పలుకుతారు. ఎన్నికల ముందు రాజకీయ నాయకులు నిర్వహించే సభలు, సమావేశాల సమయంలోనూ తెలివిగలవారిగా ప్రవర్తిస్తున్నామని భ్రమపడుతుంటారు. పోలింగ్‌కు కొద్ది గంటల ముందు నిఘా నేత్రాలకు దూరంగా, చాటు మాటు పంపిణీల వ్యవహారం ప్రారంభమయ్యే వరకూ వారిలో ఇదే ధోరణి కొనసాగుతుంది. ఇక ఆ తరువాత నాయకుల తరపున రంగంలోకి దిగిన కొన్ని శక్తిమంతమైన మూకలు నేరుగా ముఖాలపై చిమ్మే హైపవర్ విద్యుత్ వెలుగులకు కళ్లు బైర్లు కమ్మి ఎన్నికలు ముగిసే వరకూ కళ్లెదుట ఏం జరుగుతుందో తెలుసుకోలేని కృత్రిమ అంధత్వంలో మునిగిపోతారు. ఎప్పటిలాగే చేయి పట్టి నడిపించే ఏదో అజ్ఞాత శక్తికి తమ తెలివిని, అప్పటిదాకా చెప్పుకున్న రాజకీయ చైతన్యాన్ని తాకట్టు పెట్టి అచేతనంగా, అనాలోచితంగా ఓటు హక్కు వినియోగించుకుంటారు. బలమూ బలగమున్న పార్టీలు ఎప్పటిలాగే గెలిచి, అధికార పీఠం అందుకుంటాయి. నాయకుల పుణ్యమా అని రాజకీయాల మత్తుకి అలవాటైన ప్రజలు ఎన్నికల అధ్యాయం ముగిసిన తరువాత చర్చోపచర్చలకు, విశ్లేషణలకు తెర తీస్తారు. గెలుపోటములపై పోస్ట్‌మార్టం ప్రారంభిస్తారు. ఫలానా పార్టీ గెలిచిందని, ఫలానా పార్టీ ఓడిందని, మరో పార్టీకి పాపం డిపాజిట్లు కూడా దక్కలేదని అమాయకంగా మాట్లాడు కుంటారు. ఈ తతంగమంతా దశాబ్దాల నుంచి సాగుతున్నదే. ఈ ప్రక్రియలో ఎటువంటి మార్పు కనిపించదు. అధికార పీఠాన్ని అందుకోవాల్సిన పార్టీలు ప్రజల మానసిక స్థితికి, సామర్థ్యానికి తగ్గట్టుగా పథక రచన చేస్తుంటాయి. పీఠాన్ని అందుకుంటాయి. అలాగే, పరాజయం పాలయిన పార్టీలు మళ్లీ అవకాశం రాకపోతుందా అని ఐదేళ్లపాటు నిరీక్షిస్తూనే ఉంటాయి. అయితే, పీఠమెక్కే పార్టీలు మారుతున్నా, ప్రభుత్వాలు మారుతున్నా, కలలు సాకారం కాక, ఆశలు నెరవేరక ఓట్లేసే ప్రజలు మాత్రం ప్రతిసారీ ఓడిపోతూనే ఉన్నారు. ఒకసారి, రెండుసార్లు కాదు. ఎన్నికలు జరిగిన ప్రతిసారి ఈ ఓటమిని ఎదుర్కొంటూనే ఉన్నారు. అదెలా అంటే.. ఉపాధితో ఊరటనిస్తామని ఆశపెడుతున్న జాబ్ క్యాలెండర్లు ఎండమావిలా మారిపోతుండడంతో లక్షలాది మంది నిరుద్యోగులు ఓడిపోతున్నారు. ఇక త్వరలోనే మెగా డీయస్సీ అన్న ప్రభుత్వ ప్రకటనలు నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా అమలు కాకపోవడంతో రేపటి గురువులు నిరాశకు గురై, చివరికి సర్కారు ఎత్తుగడల ముందు ఓడిపోతున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కేంద్రాలకు, తమకు మధ్య అనుకోకుండా వచ్చి చేరుతున్న దళారీల నుంచి ఈసారైనా తప్పించుకోగలమని, తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోతుందా అని తమకు తామే ధైర్యాన్ని నూరిపోసు కుంటున్న రైతన్నలు ప్రతి యేటా యథావిధిగా ఓడిపోతూనే ఉన్నారు. దేశంలో సుమారు డెబ్బై శాతం మంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పుకుంటున్న వ్యవసాయ రంగాన్ని ఉపాధి హామీతో అనుసంధానం చేయాలన్న ప్రతిపాదనలు దశాబ్దాలు గడుస్తున్నా ప్రతిపాదన దశ దాటక వ్యవసాయానికి మదుపులు పెట్టలేని రైతులు ఖరీఫ్‌లోను, రబీలోను ఓడిపోతూనే ఉన్నారు. విద్యుత్‌లో రాయితీలు ఇస్తే పరిశ్రమల మనుగడ సుసాధ్యమవుతుందని, తమ బతుకులు బాగుపడతాయని ఎదురు చూస్తున్న కార్మికులు రాయితీలు, విద్యుత్‌లో ప్రత్యేక టారిఫ్‌లు వర్తించక ఓడిపోతూనే ఉన్నారు. సంవత్సరాల తరబడి ఓపీఎస్ అమలు కోసం ఎదురుచూస్తూ పోరాటం సాగిస్తున్న సీపీఎస్ బాధిత ఉద్యోగులు ఓడిపోతూనే ఉన్నారు. అరాచకశక్తుల అండతో బహిరంగంగా నడి రోడ్లపై సంచరించే నరరూప రాక్షసుల నుంచి తమను రక్షించడానికి, దిశ, పోక్సో వంటి కొత్త చట్టాలున్నాయని, ఈసారైనా అవి మరింత బలంగా అమలవుతాయని, తాము ధైర్యంగా బయట తిరగగలమన్న ఆడపిల్లలు, చట్టాలను అమలు చేసే ధైర్యం లేని కొంతమంది చేతకాని బ్యూరోక్రాట్ల సాక్షిగా నిత్యం ఓడిపోతూనే ఉన్నారు. ప్రతి నెలా చేతికందే వేతనానికి తగ్గట్టుగా బడ్జెట్ తయారు చేసుకొంటూ ఉప్పు, పప్పులూ వంటి నిత్యావసరాల ధరలు ఇకనైనా అందుబాటులోకి వస్తాయని ఆశపడుతున్న సగటు వేతన జీవి, సంచి పట్టుకొని మార్కెట్‌కి వెళ్లిన ప్రతిసారి ఓడిపోతూనే ఉన్నాడు. ఇలా అడుగడుగునా ఓటమి తప్ప గెలుపు రుచి చూడని సామాన్య జనం చివరికి ఓటమిని అలవాటుగా మార్చేసుకుంటున్నారు తప్ప, మాట తప్పుతున్న నాయకుణ్ణి ఇంటి ముఖం పట్టించడానికి ఇష్టపడడంలేదు. ఇచ్చిన మాటకు కట్టుబడతామని, చేతిలో చెయ్యేసి, ఓట్లేయించుకుంటున్న నాయకులు ఎప్పుడు మారతారు? సామాన్య జనాన్ని ఎప్పుడు గెలిపిస్తారు?

# నేటి నుంచి ఎప్‌సెట్



హైదరాబాద్ : రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చ ర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఇఎపిసెట్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 11వ వ రకు ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. మంగళ, బుధవారాలో(మే 7,8) తేదీలలో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగానికి, ఈ నెల 9, 10,11 తేదీలలో ఇంజనీరింగ్ విభాగానికి పరీక్షలు నిర్వహిస్తారు. రాష్ట్రంలో ఇఎపిసెట్ పరీక్షకు ఈ ఏడాది 3,54,803 మందికి దరఖాస్తు చేసుకోగా, ఇంజినీరింగ్ విభాగానికి 2,54,543 మంది, అ గ్రికల్చర్, ఫార్మా విభాగానికి 1,00,260 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఎఇపిసెట్ పరీక్షలు 21 జోన్లలో పరీక్ష నిర్వహిస్తుండగా.. వీటిలో తెలంగాణలో 16, ఎపిలో 5 జోన్లు ఉన్నా యి. అగ్రికల్చర్, ఫార్మాకు135, ఇంజినీరింగ్‌కు 166 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది బయోమెట్రిక్‌తో పాటు ఫేషియల్ రికగ్నేషన్ ద్వారా అభ్యర్థుల గుర్తింపును అమలు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాలలో విద్యుత్ అంతరాయం లేకుండా తగిన ఏర్పాట్లు చేశారు.


**అమలులో నిమిషం నిబంధన**

రోజుకు రెండు సెషన్ల చొప్పున పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండో సెషన్ ఉంటుంది. పరీక్షా సమయానికి 90 నిమిషాల ముందు అంటే ఉదయం 7.30 గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. కనీసం 20 నిమిషాల ముందే కేంద్రానికి చేరుకోవాలని విద్యార్థులకు కన్వీనర్ సూచించారు. విద్యార్థుల వివరాల పరిశీలనకు 20 నిమిషాల సమయం పడుతుందని, కాబట్టి విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు ఉదయం సెషన్‌కు 9 గంటల వరకు రిపోర్టింగ్ చేయాలి. ఆ తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించమని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ వెంట ఒక గుర్తింపు కార్డు, ఇటీవల తీసుకున్న ఫొటో తీసుకువెళ్లాలి. కళాశాల ఐడీకార్డు, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, ఓటర్‌ఐడీని గుర్తింపు కార్డుగా పరగణిస్తారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌పై ఆన్‌లైన్ ఫైల్ చేసిన దరఖాస్తుపై ఇన్విలేటర్ ఎదురుగా సంతకం చేయాలి.

**వాటర్ బాటిళ్లకు అనుమతి ఉండదు**

ఇఎపిసెట్ పరీక్షా కేంద్రాల్లోకి వాటర్ బాటిళ్లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు అనుమతి ఉండదు. పరీక్షా కేంద్రాలలోనే విద్యార్థులు మంచినీళ్లతో పాటు డయాబెటీస్ వంటి ఆరోగ్య సమస్యతో బాధపడే వారికి బిస్కట్లు అందజేస్తారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ పాయింట్ పెన్‌తో ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం తీసుకెళ్లాలి. ఇఎపిసెట్ రాసే విద్యార్థులకు బయోమెట్రిక్ తప్పనిసరి. ఈకారణంగా చేతులకు గోరింటాకు, ఇతర డిజైన్లు వేసుకుంటే ఇబ్బంది కలిగే అవకాశం ఉంటుంది. చేతులు శుభ్రంగా కడుకుంటే బయోమెట్రిక్ హాజరుకు ఇబ్బంది ఉండదు.

# కొవిడ్ 19 నుంచి కొత్త వేరియంట్ 'ఫ్లర్ట్'



కొవిడ్ 19 మహమ్మారిలో కొత్త వేరియంట్ 'ఫ్లర్ట్' (ఎఫ్ఎల్ఐఆర్‌టి) అమెరికాలో శీఘ్రగతిని వ్యాపిస్తోంది. ఈ కొత్త కొవిడ్ 19 వేరియంట్ ఒమిక్రాన్ జెఎన్.1 వర్గానికి చెందినది. ఇవి కెపి.2, కెపి 1.1 మ్యుటేషన్లు. ఇది పూర్వపు ఒమిక్రాన్ వేరియంట్ల కన్నా మరింత తీవ్రమైన అంటువ్యాధిగా పరిగణిస్తున్నారు. అమెరికా అంటువ్యాధుల సంస్థ (ఐడిఎస్ఎ) సమాచారం ప్రకారం, కెపి.2 కలిగించే అస్వస్థతల దామాషా త్వరితగతిన పెరుగుతోంది. ఇతర ఫ్లర్ట్ వేరియంట్ కెపి1.1 కూడా అమెరికాలో చలామణీలో ఉన్నది. ఫ్లర్ట్ పేరుకు వాటి మ్యుటేషన్ల సాంకేతిక నామాలు ఆధారమని ఐడిఎస్ఎ తెలిపింది. ఫ్లర్ట్ వేరియంట్ లక్షణాలు దాదాపుగా అవే. గొంతులో మంట, దగ్గు, రక్తచలన దోషం, అలసట, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, జ్వరం, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, అతిసారం, రుచి. వాసన లే కపోవడం సాధారణ లక్షణాలు. "కెపి.2, కెపి1.1 వేరియంట్లు పూర్వపు ఒమిక్రాన్ వేరియంట్ల కన్నా మరింత తీవ్ర అంటువ్యాధి కాగల కొత్త మ్యుటేషన్లు. వాటి లక్షణాలు పూర్వపు వేరియంట్ల మాదిరే జ్వరం, దగ్గు, అలసట కూడుకున్నది. అయితే, శీఘ్ర వ్యాప్తి రేటు దృష్టా కఠినమైన ముందుజాగ్రత్త చర్యలు అవసరం' అని గురుగ్రామ్ మేదాంతలో ఇంటర్నల్ మెడిసిన్ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ సుశీల కటారియా సూచించారు. ఈ లక్షణాల తీవ్రత అంతర్లీనమైన ఆరోగ్య పరిస్థితులు, ప్రస్తుత రక్షణ స్థాయిని బట్టి ఉంటుంది. అయితే, ఫ్లర్ట్ వేరియంట్లను భారత్‌లో ఇంకా కనుగొనలేదు. అంతే కాదు. అమెరికాలో ఆసుపత్రిలో చేరికల సంఖ్యలో గణనీయమైన పెరుగుదల గురించి సమాచారం లేదు.

# రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి తొలగిస్తాం: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కుల ఆధారిత రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం గరిష్ఠ పరిమితిని తొలగించి దళితులు, వెనుకబడిన వర్గాలు, గిరిజనులకు రిజర్వేషన్ల కోటాను కాంగ్రెస్ పెంచుతుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. సోమవారం మధ్యప్రదేశ్‌లోని రత్నాంలో ఒక ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఈ ఎన్నికల్లో పోరాడుతున్నామని చెప్పారు. రాజ్యాంగాన్ని అంతం చేయాలని, మార్చాలని బిజెపి, ఆర్ఎస్ఎస్ ఆలోచిస్తున్నాయని ఆయన ఆరోపించారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు కాంగ్రెస్, ఇండియా కూటమి ప్రయత్నిస్తోందని ఆయన చెప్పారు. జల్(నీరు), జంగల్(అడవులు), జమీన్(భూమి)పై రాజ్యాంగం మీకు హక్కు ఇచ్చిందని, ఆ హక్కులను తొలగించాలని, సంపూర్ణ అధికారం తన వద్దనే ఉంచుకోవాలని ప్రధాని నరేంద్ర మోడీ భావిస్తున్నారని చేతిలో రాజ్యాంగం పుస్తకాన్ని పట్టుకుని రాహుల్ ఆరోపించారు. ఈసారి ఎన్నికల్లో గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బిజెపి నాయకులు చెబుతున్నారని ఆయన అన్నారు. ఈ కారణంగానే 400కి మించి సీట్లు కావాలంటూ బిజెపి నాయకులు నినాదాలు ఇస్తున్నారని, అయితే 400 మాట అటుంచి కనీసం 150 సీట్లు కూడా ఆ పార్టీకి రావని ఆయన జోస్యం చెప్పారు. రిజర్వేషన్లు తొలగిస్తామని వారు అంటున్నారని, కాని 50 శాతానికి మించి మీకు రిజర్వేషన్లు పెంచుతామని తాను ఈ వేదిక నుంచి హామీ ఇస్తున్నానని రాహుల్ తెలిపారు. పేదలు, వెనుకబడిన వర్గాలు, దళితులు, ఆదివాసీలకు అవసరమైన మేరకు రిజర్వేషన్లు కల్పిస్తామని ఆయన తెలిపారు. ఆదివాసీలపై జరుగుతున్న అఘాయిత్యాలకు సంబంధించిన వార్తలను మీడియా చూపించదని ఆయన ఆరోపించారు. మీ పిల్లలను అత్యాచారం చేస్తారు..మీ భూమిని లాక్కుంటారు..కాని మీడియా ఈ వార్తలను రాయదు. ఇందుకు కారణం ఉంది. ఈ మీడియా కంపెనీలలో ఆదివాసీలు లేరు అని రాహుల్ ఆరోపించారు. దేశంలోని ప్రభుత్వాన్ని



90 మంది బ్యూరోక్రాట్లు నడుపుతున్నారని ఆయన చెప్పారు. బడ్జెట్‌లను వారే పంపిణీ చేస్తారు. 90 మందిలో ఒకరే ఆదివాసీ. ముగ్గురు వెనుకబడిన తరగతులకు చెందిన వారు. దళిత వర్గాలకు చెందిన వారు ముగ్గురు. మీకు చెందిన వారు మీడియాలో కాని కార్పొరేట్ ప్రపంచంలో కాని లేరు. దీన్ని మార్చాలని మేము భావిస్తున్నాము. అందుకే కులగణన, ఆర్థిక సర్వే జరిపించాలని నిర్ణయించుకున్నాము అని రాహుల్ తెలిపారు. రైతులకు వారి పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తామని, రుణ మాఫీ చేస్తామని ఆయన వాగ్దానం చేశారు. తాము ఇస్తున్న హామీలు ఇవేనని, వీటితో మీ జీవితాలు మార్చివేస్తామని ఆయన ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల నాలుగవ దశలో మే 13న రత్లాంలో పోలింగ్ జరగనున్నది. ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ కేంద్ర మంత్రి కాంతిలాల్ భూరియా పోటీ చేస్తుండగా బిజెపి తరపున అనితా నగర్ సింగ్ చౌహాన్ పోటీ చేస్తున్నారు.

# ఎంఎల్ఎ రేవణ్ణ నివాసంలో సిట్ తనిఖీ

ఒక మహిళను అపహరించి, అక్రమంగా నిర్బంధించారన్న ఆరోపణ సందర్భంగా జెడి (ఎస్) ఎంఎల్ఎ హెచ్‌డి రేవణ్ణపై కేసును దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సోమవారం బెంగళూరు బసవనగుడిలోని ఆయన నివాసంలో స్పాట్ తనిఖీ నిర్వహించింది. రేవణ్ణ కుటుంబ సభ్యులు ఎవరూ లేనికారణంగా ఆయన న్యాయవాది గోపాల్‌ను స్పాట్ తనిఖీ కోసం సిట్ పిలిపించింది. సిట్ రెండు రోజుల క్రితం హాసన్ జిల్లా హొలెనరసిపురలో ఎంఎల్ఎ నివాసంలో తనిఖీ నిర్వహించింది. మాజీ ప్రధాని హెచ్‌డి దేవెగౌడ కుమారుడైన రేవణ్ణ రెండు కేసులు ఎదుర్కొంటున్నారు. వాటిలో ఒకటి వంటమనిషిపై అత్యాచారానికి సంబంధించినది. ఆ కేసులో రేవణ్ణ కుమారుడు ప్రజ్వల్ కూడా ఒక నిందితుడు. రెండవ కేసు ఈ నెల 2న నమోదు చేసిన కిడ్నాపింగ్ కేసు. తన తల్లి చేతులు కట్టివేసి ప్రజ్వల్ అత్యాచారం చేసినట్లుగా వీడియోలు బహిర్గతం అయిన తరువాత రేవణ్ణ సహాయకుడు సతీష్ బాబన్న ఏప్రిల్ 29న ఆమెను ఒక బైక్‌పై తీసుకువెళ్లి అక్రమ నిర్బంధంలో ఉంచినట్లు బాధితురాలి కుమారుడు ఆరోపించారు. ఆ మహిళను రక్షించారు. ఆమెను లైంగికంగా హింసించిన ప్రదేశాలకు



పోలీస్ బృందం వెళుతోంది. అత్యాచారం జరిగిన వివిధ ప్రదేశాలకు ఇద్దరు ఫిర్యాదీలను సిట్ తీసుకువెళ్లింది. ఇది ఇలా ఉండగా, జెడి (ఎస్) నేత బసవనగుడి నివాసం లోపలికి తనను సిట్ అనుమతించలేదని రేవణ్ణ న్యాయవాది గోపాల్ ఆరోపించారు. స్పాట్ తనిఖీ కోసం తనకు నోటీస్ ఇచ్చారని, కానీ సిట్ తనను లోపలికి అనుమతించలేదని ఆయన ఆరోపించారు.

# కంటి డాక్టర్‌ను సంప్రదించండి: బిజెపి నాయకులకు చిదంబరం సలహా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ మేనిఫెస్టోపై బిజెపి నాయకులు చేస్తున్న విమర్శలను మాజీ కేంద్ర మంత్రి పి చిదంబరం సోమవారం తిప్పికొట్టారు. సంపద సృష్టి అనే పదాన్ని సంపద పంపిణీగా బిజెపి నాయకులు చదివితే వారు మళ్లీ మాధ్యమిక పాఠశాలకు వెళ్లడమో లేక కంటి డాక్టర్‌ను సంప్రదించడమో చేస్తే మంచిదని చిదంబరం చురకలు అంటించారు. తమ పార్టీ ఆర్థికాభివృద్ధికి, సంపద సృష్టికి కట్టుబడి ఉందని కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీకి చైర్మన్‌గా ఉన్న చిదంబరం తెలిపారు. యుపిఎ ప్రభుత్వం కొనసాగి ఉంటే దేశ ఆర్థిక పరిస్థితి మళ్లీ రెట్టింపు అయ్యేదని, 202324లో రూ. 200 లక్షల కోట్లకు చేరుకునేదని చిదంబరం తెలిపారు. రానున్న పదేళ్లలో జిడిపిని రెట్టింపు చేయాలని కాంగ్రెస్ లక్ష్యం పెట్టుకుందని ఆయన చెప్పారు.



# నిన్ను చూసి గర్వపడుతున్నాం: పూంచ్‌లో అమరుడైన సైనికుడి సోదరి ఆవేదన

చింద్వారా : ఉగ్రవాదుల దాడిలో శనివారం గాయాలపాలై మరణించిన భారత వైమానిక దళ (ఐఎఫ్ ) సైనికుడు కార్పొరల్ విక్కీ పహాడే మృతదేహం సోమవారం చింద్వారా లోని అతడి స్వగ్రామానికి చేరుకుంది. కుటుంబ సభ్యులు ఆయనకు అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నారు. ఐఎఫ్ కాన్వాయ్‌పై జమ్ముకశ్మీర్ లోని పూంచ్‌లో శనివారం ఉగ్రవాదులు జరిపిన దాడిలో విక్కీ మరణించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న విక్కీ సోదరి గీతా పహాడే మీడియాతో మాట్లాడుతూ " నా సోదరుడిని చూసి గర్వపడుతున్నా. శనివార సాయంత్రం 6.30 గంటలకు అతడు ఉగ్రదాడిలో గాయపడ్డాడని మాకు సమాచారం వచ్చింది. అనంతరం నా సోదరుడు వీరమరణం పొందాడని తెలిసింది. అతనికి న్యాయం జరగాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు. గీతాపహాడే భర్త మాట్లాడుతూ " వారి కుటుంబంలో విక్కీ ఒక్కగా నొక్క కుమారుడు. అతడి మరణంతో ఐదేళ్ల కుమారుడు తండ్రి లేని వాడయ్యాడు. అయినా విక్కీ దేశం కోసం ప్రాణాలివ్వడం మాకు గర్వకారణం" అని కన్నీటి పర్యంతమయ్యారు. విక్కీ పహాడేకు భారత వైమానిక దళం ఆదివారం సంతాపం తెలిపింది. పూంచ్




ప్రాంతంలో వైమానిక దళం కాన్వాయ్‌పై ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో పలువురు సైనికులు గాయపడ్డారు. తీవ్రంగా గాయాలు పాలైన విక్కీ చికిత్స పొందుతూ మరణించారు.

# 'హనుమాన్'లో విగ్రహం చిరంజీవి స్టాలిన్ సినిమా రిఫరెన్స్ : ప్రశాంత్ వర్మ



టాలీవుడ్ దర్శకుడు ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో వచ్చిన రీసెంట్ బ్లాక్ బస్టర్ 'హనుమాన్'. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి వరల్డ్‌వైడ్‌గా రూ. 250 కోట్లుకు పైగా వసూళ్లు రాబట్టింది. ఇక ఈ సినిమాకు ప్రస్తుతం సీక్వెల్ తీసే పనిలో బిజీగా ఉన్నాడు ప్రశాంత్ వర్మ. అయితే హనుమాన్ సినిమాలో అందరిని బాగా కట్టిపడేసిన సీన్ హనుమంతుడి విగ్రహం. అంజనాద్రి కొండపై వెలిసిన ఈ విగ్రహం మూవీ మొత్తానికి హైలెట్‌గా నిలిచింది. అయితే ఈ విగ్రహంపై దర్శకుడు ప్రశాంత్ వర్మ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నాడు. ఈ సినిమాలో హనుమంతుడి విగ్రహంను మెగాస్టార్ చిరంజీవి స్టాలిన్ సినిమాలోని పోస్టర్ రిఫరెన్స్ తీసుకుని డిజైన్ చేశాం. చిరంజీవిని ఆ పోస్టర్‌లో చూడగానే ఏదో తెలియని గూస్ బంప్స్ వస్తుంటాయి. అందుకే ఆ పోస్టర్‌ను రిఫరెన్స్‌గా వాడుకున్నాం. ఫైనల్ అవుట్ సూపర్ వచ్చింది అని తెలిపాడు. దీంతో ఈ వార్త విన్న మెగా ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు.




# నా బాడీ సూపర్ డీలక్స్..

## 'యేవమ్' నుంచి అషు రెడ్డి ఫస్ట్ లుక్ విడుదల

యువ నటుడు నవదీప్ తన సొంత నిర్మాణ సంస్థ సి-స్పేస్ ప్రొడక్షన్స్ పతాకంపై 'యేవమ్' అనే సినిమా నిర్మిస్తున్న విషయం తెలిసిందే. చాందిని చౌదరి ప్రధాన పాత్రలో వస్తున్న ఈ చిత్రంలో వశిష్ట సింహా, జైభారత్, ఆషురెడ్డి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు ప్రకాష్ దంతులూరి దర్శకత్వం వహిస్తుండగా.. నవదీప్, పవన్ గోపరాజు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి చాందిని చౌదరి ఫస్ట్ లుక్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. "ఆడపిల్లనే! ఐతే ఏంటంట?" అంటూ పోలీసుగా సీరియస్ లుక్‌లో చాందిని ఉండగా.. మహిళా సాధికారికతను చాటి చెప్పే విధంగా చాందిని పాత్ర ఈ చిత్రంలో కనిపించనుంది. ఇదిలావుంటే తాజాగా మూవీ నుంచి మరో కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ మూవీ నుంచి అషు రెడ్డి ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. నా బాడీ సూపర్ డీలక్స్ అంటూ ఈ పోస్టర్ ఉండగా.. హారిక అనే బోల్డ్ పాత్రలో అషు రెడ్డి నటించబోతున్నట్లు తెలుస్తుంది. చాందిని చౌదరి, వశిష్ట సింహా, జైభారత్, ఆషురెడ్డి, గోపరాజు రమణ, దేవిప్రసాద్, కల్పిత తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫర్క్ష్మ ఎస్‌వీ విశ్వేశ్వర్, సంగీతం కీర్తన శేషు, నీలేష్ మందలపు అందిస్తున్నారు. సుజనా అడుసుమిల్లి ఎడిటర్‌గా, రాజు పెన్మెత్స ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

## కన్నప్ప లేటెస్ట్ అప్‌డేట్..

# తన పార్ట్ షూటింగ్‌ను పూర్తి చేసిన అక్షయ్



మంచు విష్ణు హీరోగా వస్తున్న తాజా చిత్రం 'కన్నప్ప'. మోహన్ బాబు నిర్మాణంలో వస్తున్న ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అత్యంత భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. రీసెంట్‌గా మహాశివరాత్రి కానుకగా ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ కూడా వదిలారు మేకర్స్. ఈ ఫస్ట్ లుక్‌లో విష్ణు జలపాతం నుంచి ఎంట్రీ ఇస్తూ.. బాణంను ఎక్కుపెట్టినట్లు కనిపిస్తున్నాడు. ప్రస్తుతం ఈ పోస్టర్ వైరల్ అవుతుండగా.. తాజాగా మూవీకి సంబంధించి ఒక అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో బాలీవుడ్ ఖిలాడీ, నటుడు అక్షయ్ కుమార్ కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంతోనే టాలీవుడ్‌లో ఎంట్రీ ఇవ్వబోతున్నాడు అక్షయ్ కుమార్. అయితే ఈ సినిమా కోసం ఏప్రిల్ 16 నుంచి షూటింగ్‌లో పాల్గొంటున్నాడు అక్షయ్.

తాజాగా అతడి పాత్రకు సంబంధించిన చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ఈసందర్భంగా ఆయనతో దిగిన ఫొటోలను మంచు విష్ణు ఎక్స్ వేదికగా పంచుకున్నారు. విష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్న కన్నప్పలో మోహన్‌బాబు, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, మోహన్ లాల్, నయనతార, మధుబాల, శరత్‌కుమార్, శివరాజ్‌కుమార్ ఇతర నటీనటులు కీ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, స్టీఫెన్ దేవసి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సమకూరుస్తున్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ స్క్రీన్‌ప్లే సమకూరుస్తున్నారు.